సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



ఆ గ్రామం.. మద్యానికి దూరం

జంగారెడ్డిగూడెం మండలంలోని అమ్మపాలెం మద్యపాన నిషేధిత గ్రామంగా ఆదర్శంగా నిలుస్తోంది. 23 ఏళ్లుగా గ్రామస్తులు కట్టడిగా ఉంటున్నారు. 8లో ▸



కాల్‌మనీ కేసులో..

ఏలూరుతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో దారుణాలకు పాల్పడిన కాల్‌మనీ ముఠాలోని ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸



చిరుత కలకలం

ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకానగర్‌లో చిరుత సంచారం కలకలం రేపింది. స్థానికులు భయాందోళన చెందుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

టెట్‌కు 87.8 శాతం హాజరు



భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు 87.8 శాతం అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ జి.నాగమణి తెలిపారు. ఉదయం సెషన్‌లో 90 మందికి 79 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 90 మందికి 79 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

రోడ్ల నిర్మాణం కోసం దీక్ష

భీమవరం: జిల్లాలో అధ్వానంగా ఉన్న రోడ్లను తక్షణమే నిర్మించాలని కోరుతూ ఈనెల 22, 23 తేదీల్లో సీపీఐ ఆధ్వర్యంలో భీమవరంలో 32 గంటల నిరసన దీక్ష చేపట్టనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా జిల్లా కేంద్రం భీమవరం చేరుకునే కైకలూరు, నాగిడిపాలెం, గణపవరం, తణుకు రోడ్ల నిర్మాణం తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. 22న ఉదయం ప్రకాశం చౌక్ సెంటర్‌లో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు దీక్షలు ప్రారంభిస్తారని, 23న రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ దీక్షలను విరమింపజేస్తారని తెలిపారు. రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సాంకేతిక సమస్యలు అధిగమించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఉచిత ఇసుక పాందడానికి సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కాల్ సెంటర్ సాంకేతిక సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. కాల్ సెంటర్‌కు వచ్చిన కాల్స్‌ను త్వరితగతిన పరిష్కరించాలని, సాంకేతిక లోపాలుంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ పేరిట పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్లు 93914 45753, 86882 91997, 81869 39223, 95501 75144లో సంప్రదించాలని ప్రజలను కోరారు. జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, జిల్లా గనులు, భూగర్భ శాఖ ఇన్‌చార్జ్ అధికారి కె.వెంకటేశ్వర్లు, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ మేక కిరణ్‌కుమార్, కాల్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎం బీమా పథకాలతో మేలు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంకు, పోస్టాఫీసుల్లో ఖాతా ఉన్న వారంతా పథకాల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఏడాదికి పీఎంజేజేబీవైకు రూ.436, పీఎంఎస్‌బీవైకు రూ.20 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఈనెల 16 నుంచి జనవరి 15 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో బ్యాంకర్లు శిబిరాలను నిర్వహించేలా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ చొరవ చూపాలని సూచించారు.

రేపటి నుంచి పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు

జిల్లా ఎస్పీ నయీం అస్మి


భీమవరం: పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా నిర్వహించే పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు సోమవారం నుంచి అట్టహాసంగా ప్రారంభం కానున్నాయని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసుశాఖ సిద్ధమైందని పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా స్మారకోత్సవాలు నిర్వహిస్తామని తెలపిఆరు. సమాజంలో పోలీసుల పాత్ర కీలకమని, వారి విధులు, త్యాగాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశంతో స్మారకోత్సవాలు నిర్వహించనున్నామని ఎస్పీ తెలిపారు.

21 నుంచి సర్టిఫికెట్ కోర్సు

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో ఈనెల 21 నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సును నిర్వహించనున్నట్టు కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు శనివారం ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 30 మంది ప్రతినిధులకు నేలలు, నేలల పోషక యాజమాన్యం, రసాయన, సేంద్రీయ ఎరువుల వినియోగం, ఫెర్టిలైజర్ కంట్రోల్ యాక్ట్, సమస్యాత్మక నేలల యాజమాన్యం, ఎరువుల్లో కల్తీ గుర్తించడం తదితర అంశాలపై తరగతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు.

శవాలతో వ్యాపారం!

- ఏలూరు జీజీహెచ్ మార్చురీలో దారుణాలు
- ఏడాదిన్నరగా 10కి పైగా శవాల విక్రయం!
- చెన్నై, బెంగళూరుల్లోని వైద్య కళాశాలలకు తరలింపు
- దర్యాప్తు చేస్తున్న ఉన్నతాధికారులు



ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీ దారుణాలకు కేంద్ర బిందువుగా మారింది. అనాథ శవాలే అక్కడి కొందరు సిబ్బందికి ఆదాయ వనరులుగా మారాయి. ఏలూరు జీజీహెచ్‌లో కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అవినీతి బాగోతం ఎట్టకేలకు బహిర్గతమైంది. పది రోజుల క్రితం జరిగిన ఒక సంఘటనతో తీగ లాగితే.. డొంకంతా కదిలినట్లు.. మార్చురీలో సాగుతున్న అక్రమ శవాల వ్యాపారం వెలుగులోకి రానుంది. ఏలూరు జీజీహెచ్ మార్చురీలోని అనాథ శవాలను భారీ రేటుకు ఇతర రాష్ట్రాలకు, ప్రాంతాలకు తరలిస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడితే అక్రమ వ్యాపారం చేస్తున్న సిబ్బంది, వారికి సహకరిస్తున్న అధికారుల బాగోతం తేటతెల్లం అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చెన్నై, బెంగళూరుకు తరలింపు?

ఏలూరు సర్వజన ఆస్పత్రిలో అనాథ శవాలను భారీ రేటుకు విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదిన్నరగా సుమారు 8 నుంచి 10 అనాథ శవాలను ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు తరలించినట్టు తెలుస్తోంది. తమిళనాడులోని చెన్నై, కర్ణాటకలోని బెంగళూరులోని ప్రైవేటు మెడికల్ కాలేజీలకు శవాలను భారీ ధరకు తరలిస్తున్నట్టు చెబుతున్నారు. ఒక్కో శవాన్ని సుమారుగా రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు వరకూ విక్రయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అనాథ శవాలను తరలించేందుకు కేవలం అంబులెన్స్‌లకే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లిస్తున్నారని సమాచారం.

అధికారికంగా కావాలంటే..

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం ఏడాదికి సుమారు 8 వరకు శవాలను అధికారికంగా ఇస్తారని, అంతకు మించి ఇచ్చేందుకు నిబంధనలు అడ్డువస్తాయని చెబుతున్నారు. సాధారణంగా ప్రైవేటు వైద్య కళాశాలలకు ఏడాదికి 50 వరకు మృతదేహాలు అవసరం ఉంటాయి. దీంతో ఆయా కళాశాలల ప్రతినిధులు అనాథ శవాలను భారీ ధరకు కొనుగోలు చేస్తుంటారని చెబుతున్నారు. అధికారికంగా మృతదేహాలను ఇవ్వడానికి గతంలో రూ.10 వేలు చెల్లించాల్సి ఉండగా ఇటీవల ఈ మొత్తాన్ని రూ.2 లక్షలకు పెంచారు. అలాగే అధికారికంగా మృతదేహం పొందేందుకు నిబంధనలు కఠినంగా ఉన్నాయి. ఆయా కారణాలతో ఇలా అనధికారికంగా శవాల వ్యాపారం సాగుతోంది. దీనికోసం భారీగా డబ్బులు ఇచ్చుకోక తప్పదని కొందరు అంటున్నారు.

కూపీ లాగుతున్న అధికారులు

ఏలూరు జీజీహెచ్‌లోని మార్చురీ నుంచి ఈనెల 8న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అశోక్ అనే వ్యక్తి ఒక అనాథ శవాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలించేందుకు ప్రయత్నించాడు. అతనితో పనిచేసే మరో సిబ్బంది ఈ వ్యవహారంపై నిలదీయటంతో అది కాస్తా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే వరకూ వెళ్లింది. భయపడిన అశోక్ బయటకు తీసుకువెళ్లిన మృతదేహాన్ని అర్ధరాత్రి వేళ తిరిగి తీసుకువచ్చి మార్చురీలోనే పెట్టేశాడని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశిధర్ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసేందుకు నిర్ణయించారు. అనాథ శవాలను విక్రయించటం, అనధికారికంగా బయటకు తీసుకువెళ్లటంపై తీవ్ర చర్చ సాగుతోంది.

లోతైన దర్యాప్తు

గత ఏడాదిన్నర కాలంలో ఏలూరు జీజీహెచ్‌లోని మార్చురీకి ఎన్ని అనాథ శవాలు పోస్టుమార్టం నిమిత్తం వచ్చాయి ? అనాథ శవాలను ఎవరైనా బంధువులకు ఇచ్చారా ? శవాలను పూడ్చిపెట్టారా ? లేక దహనం సంస్కారాలు చేశారా.. ఇలా పలు అంశాలపై అధికారులు విచారణ చేపడుతున్నారు. మార్చురీలోని రికార్డులు, పోలీస్ అవుట్‌పోస్ట్ రికార్డులు, అలాగే శ్మశాన వాటికలో రికార్డులను తనిఖీలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ అనాథ శవాల అక్రమ వ్యాపారానికి ఎవరు సహకరిస్తున్నారనే అంశాలపై లోతైన దర్యాప్తు చేపడుతున్నామని ఏలూరు జీజీహెచ్ అధికారులు అంటున్నారు.

వైద్య సేవల్లో అలసత్వం సహించం

జాయింట్ కమిషనర్ రమేష్‌కిషోర్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ

తణుకు అర్బన్: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు సత్వర సేవలందించడంలో అలసత్వం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ టి.రమేష్‌కిషోర్ అన్నారు. శుక్రవారం రాత్రి తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని విభాగాలను పరిశీలించారు. ముఖ్యంగా డయాలసిస్ విభాగంలో ఉన్న 10 బెడ్లకు అదనంగా ఐదు బెడ్లు కేటాయింపుపై ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణతో చర్చించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలందించడంలో వైద్యవర్గాలు సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. పనితీరుపై ఫిర్యాదులు అందితే సహించేది లేదన్నారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న చెత్త కుండీని వేరే ప్రాంతానికి తరలించాలని, ఆవరణలో నీటినిల్వలు లేకుండా చూడాలని, పారిశుద్ధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముందుగా ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై నేరుగా రోగులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా డీసీహెచ్ఎస్ పాల్ సతీష్, ఆస్పత్రి ఆర్ఎంఓ సాయి బాలాజీ, వైద్యులు ఉన్నారు.

నేత్రపర్వం.. శ్రీచక్ర స్నానం



శ్రీచక్రస్నానం జరిపిస్తున్న అర్చకులు



ధ్వజావరోహణ నిర్వహిస్తున్న దృశ్యం

- నేటితో ముగియనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- రేపటి నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న అశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు శనివారం స్వామివారికి శ్రీచక్రస్నాన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముందుగా తొళక్క వాహనంపై శ్రీవారిని క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగించారు. ఆలయ యాగశాలలో స్వామి, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్ల ఉత్సవమూర్తులకు పూజాధికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచ పల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత అభిషేక తీర్థంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. అనంతరం శ్రీచక్ర పెరుమాళ్లతో పాటు ఉభయ నాంచారులకు, శ్రీవారికి తిరుమంజనాలు జరిపి హారతులిచ్చారు. సాయంత్రం ఆలయంలో నిత్యహోమ బలిహరణలు, పూర్ణాహుతి అనంతరం ధ్వజ అవరోహణ జరిపించారు. హంస వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు యశోదాకృష్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి జరుగనున్న శ్రీపుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అవుతాయని, సోమవారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను పునరుద్ధరిస్తామని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటల నుంచి భజనలు
- ఉదయం 9 గంటల నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సవం
- ఉదయం 9 గంటల నుంచి భక్తిగీతాల ఆలాపన
- ఉదయం 11 గంటల నుంచి సంగీత విభావరి
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వరకచేరి
- సాయంత్రం 5 గంటల నుంచి కూచిపూడి భరత నాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగం
- 9 గంటలకు సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన
- ప్రత్యేక అలంకారం : శయన మహావిష్ణువు

కాంట్రాక్ట్ ఉద్యోగికి ఊరట



బాధితుడి తండ్రికి చెక్కు అందిస్తున్న కమిషనర్ విజయసారథి

సాక్షి స్పందన

పాలకొల్లు సెంట్రల్: 'పోల్‌పై నుంచి పడిన కాంట్రాక్ట్ ఉద్యోగి' శీర్షికన శనివారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. బాధితుడు షణ్ముకేశ్వర్ తండ్రి తుమ్మిడి సత్యనారాయణ తన కుమారుడికి రావాల్సిన జీతం కోసం నెలా 15 రోజులుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతుండగా కమిషనర్ బి.విజయసారథి చొరవతో సమస్య పరిష్కారమైంది. కాంట్రాక్టర్‌కు బిల్లు నెల రోజుల్లో అవుతుందని, నెల తర్వాత జీతాలు ఇస్తానని చెప్పడంతో 28వ వార్డు మాజీ కౌన్సిలర్ భర్త పొట్నూరి అప్పన్న సహాయం అందిస్తానని ముందుకు వచ్చారు. బాధితుడికి రావాల్సిన రూ.65 వేలను చెక్కు రూపంలో కమిషనర్ చేతులమీదుగా బాధితుడి తండ్రికి అందజేశారు. కమిషనర్ విజయసారథి, డీఈ రాజ్‌కుమార్, అప్పన్నకు బాధితుడి తండ్రి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు.

'సైబర్' ఫిర్యాదుల్లో ఆలస్యంతో ఇబ్బందులు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



నరసాపురం: సైబర్ నేరాల బాధితులు మోసపోయామని తెలిసిన వెంటనే పోలీసులను ఆశ్రయిస్తే ఫలితం ఉంటుందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. మూడు గంటల్లోపు సమాచారం ఇస్తే సొమ్ము మొత్తం రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. శనివారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. బాధితులు ఫిర్యాదు చేసేందుకు ఆలస్యం చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. బాధితులు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని, నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రేంజ్ పరిధిలో గంజాయి రవాణా, అమ్మకాలు సాగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని చెప్పారు. అలాగే పేకాట క్లబ్‌లు పూర్తిగా మూసివేశామని, ఎక్కడైనా కార్యకలాపాలు సాగుతున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

క్రైమ్ రేట్ పెరిగింది : ఇటీవల క్రైమ్ రేట్ కాస్త పెరిగిందని, పోలీసు వ్యవస్థ మొత్తం ఎన్నికల విధుల్లో ఉండటమే కారణమని ఐజీ అన్నారు. త్వరలో పోలీసు శాఖలో 6 వేల పోస్టుల భర్తీతో సిబ్బంది కొరత తీరుతుందని చెప్పారు. హైవేలపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ముందుగా డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై సమీక్షించారు. అనంతరం ఆయన నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ నయీం అస్మీ, ఏఎస్పీ వి.భీమారావు, నరసాపురం డీఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, సీఐ బి.యాదగిరి ఆయన వెంట ఉన్నారు.

22న జాబ్‌మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ కళాశాలలో ఈనెల 22న మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్.ఉగాది రవి ప్రకటనలో తెలిపారు. హీరో, మోహన్ స్పిన్‌టెక్స్, అపోలో ఫార్మసీస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 180 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి 18–30 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు.

నేడు హైకోర్టు జడ్జి రాక

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి ఆదివారం ఏలూరు రానున్నారు. ఉదయం 7 గంటలకు గుంటూరు జిల్లా కాజా నుంచి కారులో బయలుదేరి 8.30 గంటలకు ఏలూరులో ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. అనంతరం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని సమావేశపు హాలులో జ్యుడీషియల్ అధికారుల కాన్ఫరెన్స్‌లో పాల్గొని సాయంత్రం 5 గంటలకు తిరిగి బయలుదేరతారు.

సిండి కేటుగాళ్లు

ఇది మా అడ్డా

- సిండికేట్ అయితేనే మద్యం షాపులు
- స్థానికేతరులకు 'చుక్క'లు
- పోలవరం నియోజకవర్గంలో 20 షాపుల సిండికేట్ పూర్తి
- కొన్ని మండలాల్లో పంచాయితీలు
- అద్దె షాపులు దొరక్కుండా ఇబ్బందులు
- అగ్రిమెంట్లను అడ్డుకుంటున్న వైనం
- దుకాణాల ఏర్పాటుకు ఈనెల 22 వరకు గడువు
- ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే వ్యవహారాలు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: లిక్కర్ పంచాయితీలో కూటమి ప్రజాప్రతినిధులు తలమునకలయ్యారు. అన్ని మండలాల్లో సిండికేటు అయి ఎమ్మెల్యే పర్సంటేజీ తేలిన షాపులను తెరుచుకునేలా అనుమతి ఇస్తుండటంతో జిల్లావ్యాప్తంగా మద్యం వ్యాపారుల రగడ తారాస్థాయికి చేరింది. స్థానికులకు ఒక నిబంధన, స్థానికేతరులకు మరో నిబంధన పెడుతున్నారు. సిండికేట్‌లో చేరి పర్సంటేజీ ఒప్పుకుంటే అంతా సజావుగా.. ఒప్పుకోకపోతే షాపులు అమ్మేసుకుని వెళ్లాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో జిల్లాలో లైసెన్సులు దక్కించుకున్న 8 మంది షాపులు విక్రయించుకోగా, మిగిలిన కొందరు షాపుల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు మోకాలడ్డుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాంతా ఇదే సమస్య కొనసాగుతోంది. మరోవైపు ఈనెల 22తో షాపుల ఏర్పాటుకు తుది గడువు కావడంతో సిండికేట్లు కొలిక్కి వస్తున్నాయి.

ఎమ్మెల్యే కమీషన్ 20 శాతం!

ఏలూరు జిల్లాలో 144 షాపులు, పశ్చిమగోదావరి జిల్లాలో 175 మద్యం షాపులు లాటరీ ప్రక్రియ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు కేటాయించారు. ఈనెల 15న షాపుల కేటాయింపు పూర్తిచేసి 22లోగా షాపులు ఏర్పాటు చేయాలని తుది గడువు విధించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికార పార్టీకి చెందిన కొందరు 12 సిండికేట్లుగా ఏర్పడి వందల సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేయగా పదుల సంఖ్యలోనే షాపులు దక్కాయి. కృష్ణా జిల్లా, తెలంగాణ, కర్నూలు, ఇతర జిల్లాలకు చెందిన వారికి కూడా పెద్ద సంఖ్యలో షాపులు దక్కాయి. దీంతో షాపుల పంచాయితీ, సిండికేట్ల వ్యవహారం, నియోజకవర్గ ఎమ్మెల్యేల కనుసన్నల్లో నడుస్తోంది. నియోజకవర్గంలో షాపు ఏర్పాటు చేయాలంటే సిండికేట్‌లో చేరి సగటున 20 శాతం ఎమ్మెల్యేకు ముడుపులు ఇస్తేనే వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు ఉండవు. లేనిపక్షంలో గుడ్‌విల్ మీద షాపులు ఎమ్మెల్యే సూచించిన వారికి చెప్పిన రేటుకు అప్పజెప్పి వెళ్లాల్సిందే. అంగీకరించకపోతే షాపు తెరిచే ప్రసక్తే లేదని హుకుం జారీ చేశారు. దీంతో వారం రోజులుగా నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా సిండికేట్ల పంచాయితీలు కొనసాగించి దాదాపుగా 50 శాతం మేర పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా సగటున 20 శాతం, అత్యధికంగా వ్యాపారం జరిగే చోట్ల 30 శాతం వరకు ఎమ్మెల్యేకు ఏటా కమీషన్ ఇచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

అనుమతుల పేరుతో అడ్డంకులు

పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల్లో 20 మద్యం షాపులు లాటరీ ద్వారా కేటాయించారు. వీటిలో 8 ఎస్టీలకు కేటాయించగా, కుక్కునూరు మండలంలో మద్యం షాపు టీడీపీ మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌కు అలాగే బుట్టాయగూడెంలో ఒక షాపు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సోదరుడు చిర్రి సురేంద్రకుమార్‌కు దక్కాయి. మిగిలిన షాపుల్లో కొన్ని స్థానికులకు, మరికొన్ని స్థానికేతరులకు దక్కాయి. ఈ క్రమంలో ఈనెల 16వ తేదీ నుంచి సిండికేట్ పంచాయితీలు చేసి అందరినీ సిండికేట్‌లోకి చేరాలా ఒప్పందం కుదిర్చి ప్రజాప్రతినిధికి ఏటా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఇచ్చేలా ఒప్పందాలు జరిగినట్టు సమాచారం. కొందరు సిండికేట్‌లోకి చేరడానికి అంగీకరించని క్రమంలో ఏజెన్సీలో షాపుల ఏర్పాటుకు పంచాయతీ అనుమతి తప్పనిసరి కావడంతో అక్కడ చక్రం తిప్పి దారికి తెచ్చారు. ఈ వ్యవహారం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

- కైకలూరు, నూజివీడు, మరికొన్ని మండలాల్లో సిండికేట్లు పూర్తి చేశారు.
- ఉండి నియోజకవర్గంలోనూ సిండికేట్ కొలిక్కి వచ్చింది. అత్యధిక దరఖాస్తులు దాఖలు చేసిన వ్యక్తికి ఎక్కువ షాపులు దక్కడంతో అతని కనుసన్నల్లో సిండికేట్ ఏర్పాటు చేసి అన్నింటినీ ఖరారు చేశారు.
- భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో కొన్ని మండలాల్లో సిండికేట్లు పూర్తయ్యాయి.
- ఇంకా ఉమ్మడి జిల్లాలో 24 షాపులకు పైగా ఏర్పాటు కావాల్సి ఉంది. తాడేపల్లిగూడెం, గణపవరం ప్రాంతాల్లో షాపులు దొరక్క పోవడంతో టెంట్‌లు ఏర్పాటు చేసి విక్రయాలు మొదలుపెట్టేశారు.
- ఏలూరు నగరం, దెందులూరులో 10 షాపులు ఏర్పాటు కావాల్సి ఉంది. సిండికేట్ల తర్జనభర్జనలు తేలకపోవడంతో అద్దెలకు షాపులు దొరకకుండా అధికార పార్టీ నాయకులు బలంగా అడ్డుకుంటున్నారు.

క్లుప్తంగా

అసత్య కథనాలు ఆపకపోతే పరువు నష్టం దావా వేస్తా

గోపవరం సర్పంచ్ కంచర్ల వాణి




ముసునూరు: తనకు పార్టీ మారే ఆలోచన లేదని తన జీవితం వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతుందని వైఎస్సార్ సీసీ మండల మహిళా నేత గోపవరం సర్పంచ్ కంచర్ల వాణి స్పష్టం చేశారు. శనివారం ఆమె మాట్లాడుతూ టీడీపీ వైపు చూస్తున్నానంటూ తనపై వచ్చిన పత్రికా కథనాన్ని ఆమె ఖండించారు. ఇలాంటి అసత్య ప్రచారాన్ని ప్రజలు, పార్టీ శ్రేణులు నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లో పార్టీ మారే ప్రసక్తి లేదన్నారు. కొందరు కావాలని గ్రామాల్లో మైండ్ గేమ్‌లు ప్రారంభించి, వైఎస్సార్ సీపీని దెబ్బ తీయాలని చూస్తున్నారన్నారు. కుట్రలు, కుతంత్రాలను తిప్పికొడతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు. అసత్య కథనాలు ఆపకపోతే పరువు నష్టం దావా వేస్తానని ఆమె హెచ్చరించారు.

ఎన్డీఏ కూటమిని నిలదీద్దాం

నూజివీడు: మతోన్మాద ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా భారతదేశ లౌకిక ఫెడరల్ వ్యవస్థను కాపాడుకునేందుకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి హరినాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో డిసెంబర్ 4న నిర్వహించే 'ప్రజా హక్కుల' ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్య ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఒకే దేశం, ఒకే పార్టీ అనే నినాదంతో జమిలి ఎన్నికలకు సిద్ధమవుతున్నారని దానికి చంద్రబాబు జై కొట్టడం హాస్యాస్పదమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విభజన హామీలు, ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని నిలదీయలేని నిస్సహాయ స్థితిలో చంద్రబాబు ఉన్నారని ఎద్దేవా చేశారు.

ఆ గ్రామం.. మద్యానికి దూరం

- ఆదర్శంగా నిలుస్తున్న అమ్మపాలెం
- 23 ఏళ్లుగా గ్రామంలో మద్యపాన నిషేధం అమలు



అమ్మపాలెం గ్రామం వ్యూ

జంగారెడ్డిగూడెం రూరల్ : కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీతో గ్రామాల్లో మద్యం ఏరులై పారనుంది. ప్రస్తుతం మద్యం షాపుల కేటాయింపు కూడా పూర్తికావడంతో ఏ గ్రామంలో ఎక్కడ మద్యం షాపులు పెడుతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. అయితే ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం గ్రామం మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధం. ఈ గ్రామంలో మద్యం మాటే వినిపించదు. ఇక్కడ మద్యం విక్రయాలు జరగవు. బెల్ట్‌షాపులు ఉండవు. గత 23 సంవత్సరాలుగా గ్రామ ప్రజలు కట్టడిగా ఉంటూ మద్యపాన నిషేధిత గ్రామంగా తీర్చిదిద్దారు. ఈ పల్లె జిల్లాలోనే మద్యపాన నిషేధిత గ్రామంగా ఆదర్శంగా నిలుస్తోంది.

యువకుల ఆలోచనతో..

2001లో గ్రామానికి చెందిన కొందరు యువకులు విజేత యువజన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో గ్రామాన్ని సంపూర్ణ మద్యపాన నిషేధ గ్రామంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నారు. 2006లో సంఘాన్ని రిజిస్టర్ చేయించారు. గ్రామంలో మద్యం విక్రయించకుండా కట్టడి పెట్టుకుని కచ్చితంగా అమలు చేశారు. ఒకవేళ వేరేచోట తాగి వచ్చి.. గ్రామంలో చిందులు వేసినా అపరాధ రుసుం వసూలు చేయాలని సభ్యులు నిర్ణయించారు. విజేత యువజన సంఘం సభ్యులు తీసుకున్న ఈ నిర్ణయానికి గ్రామస్తులు, మహిళల నుంచి కూడా మద్దతు లభించింది. మొదట్లో సంఘ సభ్యులకు కొన్ని సమస్యలు ఎదురైనా రానురానూ గ్రామాన్ని సంపూర్ణ మద్యపాన నిషేధిత గ్రామంగా తీర్చిదిద్దారు. గ్రామంలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఒకవేళ ఎవరైనా మద్యం సేవించి చిందులు వేసి గొడవలు సృష్టిస్తే వారికి రూ.1000 అపరాధ రుసుం విధించాలని నిర్ణయించారు. ఈ విషయమై గ్రామస్తుల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో సైతం ఇక్కడ మద్యం అనే మాట కూడా వినిపించదు. గ్రామ పెద్దల సహకారంతో సంఘ సభ్యులు జల్లా సత్యనారాయణ, శశికాంత్, సూరవరపు నాగరాజు, సూరవరపు బాలయోగి, ఎస్.దుర్గారావు, గంగుల రాజారావు, నల్లగోపు వెంకట రామారావు, ఊసా సత్యనారాయణ, అంకెం నాగు, రామారావు తదితరులు మద్యపాన నిషేధ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నారు.

యువకుల కృషి ఫలితమే



మద్యపాన నిషేధానికి గ్రామంలో యువకులు సంఘంగా ఏర్పడి ఎంతో కృషి చేస్తున్నారు. మా గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు జరగడం ఒక సర్పంచ్‌గా నాకు ఎంతో గర్వంగా ఉంది.

– సూరవరపు రాంబాబు, సర్పంచ్, అమ్మపాలెం

మా గ్రామం.. ఆదర్శనీయం



మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. మద్యం నిషేధాన్ని ఎప్పటికీ కొనసాగిస్తాం. మా గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవడం ఆనందంగా ఉంది.

– కోనా ప్రసాద్, అమ్మపాలెం

వణికిస్తున్న ఎండాకు తెగులు



పాడి-పంట

వీరవాసరం: వాతావరణంలోని వింత పోకడలు ఖరీఫ్ సాగుకు ప్రతిబంధకంగా తయారయ్యాయి. రెండు వారాలుగా పగలు విపరీతమైన ఎండలు, అకస్మాత్తుగా మబ్బులు ఏర్పడి వర్షాలు కురవడం, రాత్రి వేళల్లో మంచు పడడం జరుగుతోంది. ఈ పరిణామాలతో ఖరీఫ్ పంటను పలు రకాల తెగుళ్లు ఆశించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వరి పంటపై ఎండాకు తెగులు దాడి చేయడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. దీని కారణంగా దిగుబడిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

30 శాతం పైరుకు ఎండాకు తెగులు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 62 వేల ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ వరి సాగు జరుగుతోంది. దీనిలో దాదాపు 30 శాతం పైరు ఎండాకు తెగులుకు గురైనట్లు అంచనా. ఎండలు తగ్గి వర్షాలు పడటంతో పదిరోజులుగా ఎండాకు తెగులు వ్యాప్తి అదుపులోకి వచ్చిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో ఎక్కువగా స్వర్ణ రకం, సంపద రకాలు సాగు చేస్తున్నారు. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో వరి ఈనిక దశలో ఉంది. భారీ వర్షాలు, వరదల కారణంగా పైరు కుళ్లిపోయి రెండోసారి నాట్లు వేసిన పొలాలు, ఆలస్యంగా నాట్లువేసిన పొలాల్లో పైరు దుబ్బుచేసే దశలోనూ, చిరుపొట్ట దశలోనూ ఉన్నాయి.

ఎండాకు తెగులు గుర్తించడం ఇలా

వరి దుబ్బు చుట్టూ ఉన్న ఆకులు పసుపు రంగులోకి మారి తర్వాత ఎండిపోతాయి. ఈనిక దశలో ఉన్న దుబ్బులకు ఈనిక రాకుండా దిగుబడి తగ్గిపోతుంది. తెగులు సోకిన వరి మొక్క ఆకులపై బూడిద రంగు మచ్చలు ఏర్పడి వాటి నుంచి తెల్లగా జిగురు పదార్థం స్రవిస్తుంది. ఎండాకు తెగులు ఒక దుబ్బు నుంచి మరో దుబ్బుకు వేగంగా వ్యాపిస్తుంది. వరికి సోకే తెగుళ్లన్నింటిలోకి ఎండాకు తెగులు ప్రమాదకరమైనది. చిరుపొట్ట, గింజ పాలుపోసుకునే దశలో ఈ తెగులు ఆశిస్తే గింజ గట్టిపడకుండా చేయడం వల్ల దిగుబడిపై గణనీయంగా ప్రభావం చూపుతుంది. ఈతెగులు వ్యాప్తి చెందకుండా రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బంది పొలంబడి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

నత్రజని వాడకం నిలిపివేయాలి



వాతావరణ మార్పుల కారణంగా ఖరీఫ్ పైరుకు ఎండాకు తెగులు అధికంగా ఆశిస్తుంది. వారంరోజుల వరకూ ఉధృతంగా వ్యాప్తి చెందిన ఈ తెగులు కొంత అదుపులోకి వచ్చింది. ఈ తెగులు పూర్తిగా నిర్మూలన చేయడం జరగదు. కాని సస్యరక్షణ చర్యల ద్వారా వ్యాప్తిని అదుపులో ఉంచవచ్చు. ఎండాకు తెగులు నివారణకు నత్రజని వాడకం పూర్తిగా నిలిపివేయాలి. పంట చేలోని మురుగు నీరు బయటకు తీసివేయాలి. ప్లాంటామైసిన్, బ్యాక్టీరియామైసిన్100 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. ఎండాకు తెగులు అధికంగా ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించి తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– బిన్నిబాబు, వీరవాసరం మండల వ్యవసాయ అధికారిణి

ఏఐ, డేటా సైన్స్‌పై వర్క్‌షాప్

నూజివీడు: రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా సైన్స్‌ల ప్రాధాన్యత దృష్ట్యా రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలో నిర్వహిస్తున్న నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 8 వారాల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. రోజురోజుకు వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నిరంతరం వర్క్‌షాపులు నిర్వహిస్తున్నామన్నారు. 8 వారాల శిక్షణ కార్యక్రమాన్ని ఐఐటీ మద్రాసు సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. వర్క్‌షాపు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఈ వర్క్‌షాపులో పాల్గొనేందుకు ఇంతవరకు 235 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.

టెక్రియా ఉత్సవ్‌లో విద్యార్థుల సందడి





టెక్రియా 2కె24లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం: మనసు పెట్టి సాధన చేస్తే లక్ష్యానికి చేరవచ్చని నిట్‌లో శనివారం సాయంత్రం ముగిసిన టెక్రియా 2కె24 ఉత్సవంలో వక్తలు పేర్కొన్నారు. రేలంగి ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ తలారి రేష్మ మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను ఒడిసి పట్టుకోవాలన్నారు. ఆలోచనల్లో నూతనత్వం మార్పునకు స్వాగతం పలుకుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



భీమవరంలో క్రీడాకారులకు చెస్ బోర్డులను ఉచితంగా పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: వెస్ట్ గోదావరి చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో డిస్ట్రిక్ట్ సెకండ్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ పోటీలను శనివారం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు చదరంగం పోటీలు ఎంతగానో దోహదపడతాయని స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు చెస్ టోర్నమెంట్స్ నిర్వహణకు సహకరించడం అభినందనీయమన్నారు. చెస్ టోర్నమెంట్‌కు సహకరించిన అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం కమిటీని కమిషనర్ అభినందించారు. ముందుగా చెస్ పోటీలను కమిషనర్ రామచంద్రారెడ్డి, అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు చెస్ బోర్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్, పట్టణ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు, చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గమిని రవి పవన్ కుమార్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వరరావు, మైలాపురి మురళి తదితరులు పాల్గొన్నారు.

పేకాటలో శిబిరంలో కానిస్టేబుళ్లు

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారు శనివారపుపేటలో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది విస్తుపోయారు. ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్లు దాడిలో పట్టుబడటం గమనార్హం. వై.జంక్షన్ సమీపంలోని అబ్బిరెడ్డి అపార్ట్‌మెంట్స్‌లో కొంతమంది పేకాట శిబిరం నిర్వహిస్తున్నారంటూ త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావుకు సమాచారం అందింది. శనివారం సాయంత్రం ఆయన తన సిబ్బందితో వెళ్లి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.2.37 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ శిబిరంలో ఏలూరు ట్రాఫిక్ కానిస్టేబుల్ రవికుమార్, భీమవరం ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రకాష్‌లు ఉండడంతో పోలీసులు అవాక్కయ్యారు.

నేడు బీచ్‌కు అనుమతి నిరాకరణ

మొగల్తూరు: బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడనున్న నేపథ్యంలో రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆదివారం బీచ్‌కు పర్యాటకులను అనుమతించడం లేదని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. సందర్శకులు సహకరించాలని ఆయన కోరారు.

కాల్‌మనీ కేసులో ప్రధాన నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ .. ఇళ్లలోకి దౌర్జన్యంగా ప్రవేశించి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న కాల్‌మనీ ముఠాలోని ప్రధాన నిందితులను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గతంలో ముఠా సభ్యులను అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం ప్రధాన నిందితుడు మేడపాటి సుధాకర్‌రెడ్డి, మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వివరాలు వెల్లడించారు. ఏలూరు సత్రంపాడు టెలికామ్ నగర్, చలసాని రెసిడెన్సీలో ఉంటోన్న మేడపాటి సుధాకర్‌రెడ్డి, అల్లాడ లావణ్య, తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన వీరమల్ల రాజేష్‌ను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే కాల్‌మనీ ముఠాలోని గూడవల్లి విద్యాసాగర్, మహ్మద్ అఖిల్ రెహమాన్‌ను అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. కాల్‌మనీ ముఠాపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌తోపాటు ఏలూరు రూరల్, ఏలూరు టూటౌన్, ఏలూరు త్రీటౌన్, టీ.నరసాపురం, ముసునూరు పోలీస్‌స్టేషన్లలో 7 కేసులు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. ఇదేతరహాలో ఎవరైనా అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ వేధింపులకు గురిచేస్తే తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ స్పష్టం చేశారు. కేసు విచారణలో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చిరుత పులి కలకలం

ద్వారకాతిరుమల మండలంలో భయాందోళనలో గ్రామస్తులు



చిరుత పాదముద్రలు



చిరుత పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీశాఖ ఏలూరు డిప్యూటీ రేంజ్ అధికారి

ద్వారకాతిరుమల : మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకానగర్‌లో శనివారం రాత్రి చిరుతపులి సంచారం కలకలం సృష్టించింది. స్థానిక వీరాంజనేయ దాబా సమీపంలో చిరుత సంచారాన్ని చూసిన పలువురు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారాన్ని పోలీస్, రెవిన్యూ, అటవీశాఖ అధికారులకు అందించారు. దాంతో ఘటనా స్థలానికి చేరుకున్న అటవీశాఖ ఏలూరు రేంజ్ అధికారి ఎస్‌వీకే కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి కె.కుమార్‌సింగ్, సిబ్బంది, భీమడోలు సీఐ జోసఫ్ విల్సన్, పలువురు రెవెన్యూ అధికారులు చిరుత పులి పాదముద్రలను గుర్తించి, వాటిని పరిశీలించారు. అవి చిరుత పులి జాడలేనని నిర్ధారించారు. అనంతరం స్థానిక అందానమ్మ చెరువు, శ్రీ కార్తికేయ ఫ్లైయాష్ బ్రిక్స్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో జాడలు గుర్తించారు. ఆ సమీప ప్రాంతంలోనే చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రజలు, శని, ఆదివారాల్లో చర్చిలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు గ్రామంలో టాంటాం వేయించారు. ద్వారకానగర్‌తో పాటు భీమడోలు, పరిసర గ్రామాల ప్రజలు పులి సంచారంతో తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

విద్యార్థి స్వామి మాలధారణపై అభ్యంతరం

నరసాపురం టేలర్ హైస్కూల్ వద్ద ఉద్రిక్తత



స్కూలు వద్ద ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు, స్వాములు

నరసాపురం : పట్టణంలోని టేలర్ ఎయిడెడ్ హైస్కూల్ వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న లంక యశ్వంత్ స్వామి మాలధారణతో పాఠశాలకు వచ్చాడు. మధ్యాహ్నం బిక్ష ఉందని.. పర్మిషన్ కావాలని టీచర్ కోమలిని కోరగా ఆమె ఇలా మాల వేసుకుని స్కూలుకు రావడం ఏంటని ప్రశ్నించిందంటూ విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లితండ్రులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వీహెచ్‌పీ నాయకులు ఉలిసి నాగేంద్ర, కటికిరెడ్డి రవికుమార్ మరికొందరు స్వాములు స్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. టీచర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐ బి.యాదగిరి సిబ్బందితో కలసి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. స్కూల్ సెక్రటరీ పోతుల జగన్ వివాదంపై ఆరా తీశారు. తాను తప్పు ఉద్దేశంతో అనలేదని పిల్లలు తప్పుగా అర్థంచేసుకున్నారని టీచర్ వివరించారు. అయితే తనకున్న అధికారంతో టీచర్‌ను మూడురోజులపాటు సస్పెండ్ చేస్తున్నట్టు సెక్రటరీ ప్రకటించారు. దీంతో ఆందోళన విరమించారు.

మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం రూరల్: మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం స్టేషన్ ఏఎస్సై భాస్కర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన నిమ్మ శివజ్యోతి కుటుంబంలో నెలకొన్న సమస్యలపై ఈనెల 17న ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల ఇంటి దగ్గర వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

దెందులూరు: మండలంలోని మేదినరావుపాలెం రైస్ మిల్లులో శనివారం ఒక వ్యక్తి బాత్‌రూమ్‌లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్సై ఆర్.శివాజీ కథనం ప్రకారం తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తూము రాంబాబు గోనెసంచులు కుడతాడు. అయితే శనివారం మేదినరావుపాలెం మిల్లులోని బాత్‌రూమ్‌లో మృతి చెంది ఉండడంతో.. మిల్లు యజమాని ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆదాయం రూ.20.69 లక్షలు

పాలకొల్లు సెంట్రల్ : పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవదాయ శాఖ భీమవరం అధికారి వర్దినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో స్వామి హుండీలను తెరిచారు. ఏడు నెలలకు రూ.20,69,703 నగదు, 24 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి, రెండు విదేశీ నోట్లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

తణుకు : తణుకు మండలం వేల్పూరులో ఇటీవల దేవాలయంలో జరిగిన చోరీకి సంబంధించి మహిళను అరెస్టు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. వేల్పూరులోని విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 15న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి స్వామికి అలంకరించిన సుమారు 500 గ్రాముల వెండి కిరీటాన్ని అపహరించుకుపోయారు. ఈ ఘటనపై గ్రామానికి చెందిన గుణ్ణం హరివెంకటరాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై మూర్తి సీసీ పుటేజీ ఆధారంగా నిందితురాలని గుర్తించారు. మలికిపురం గ్రామానికి చెందిన అల్లం దేవి అలియాస్ దుర్గను అరెస్టు చేసి ఆమె నుంచి వెండి కిరీటాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఆవు పొడవడంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం అనాకోడేరు పంచాయతీ ఈలంపూడి గ్రామానికి చెందిన కర్నాటి శ్రీను (48) ఈ నెల 17న భీమవరం నుంచి స్వగ్రామం ఈలంపూడికి వెళ్తుండగా అనాకోడేరు శివాలయం వద్ద ఆవు పొడిచింది. గాయపడిన శ్రీను భీమవరంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం ఆరోగ్య పరిస్థితి విషమించంతో మృతి చెందాడు. ఆయన కుమారుడి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై ఐ.వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: మండల కేంద్రమైన పాలకోడేరుకు చెందిన బాలిక అదృశ్యమైంది. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘువరన్ తెలిపారు.

క్లుప్తంగా

భూ రీసర్వే లోపాలు సరిచేసేందుకే గ్రామ సభలు



కె ఇల్లిందలపర్రు గ్రామ సభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ఇరగవరం: భూ రీసర్వేలో లోపాలను సరిచేసేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుందర్ రాజు తెలిపారు. శనివారం మండలంలోని కె ఇల్లిందలపర్రు, గోటేరు గ్రామాల్లో భూముల గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పోతురాజు మండల సర్వేయర్ ప్రియాంక, తెదేపా మండల అధ్యక్షుడు గొపిశెట్టి రామకృష్ణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు భారంగా నిత్యావసర ధరలు



రేలంగిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఇరగవరం: పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలు కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సీపీఎం మండల పార్టీ కన్వీనర్ కామన మునిస్వామి పేర్కొన్నారు. మండలంలోని రేలంగి గ్రామంలో శనివారం సీపీఎం నాయకల అధ్వర్యంలో పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసర ధరలు పెరిగి పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇల్లిందలపర్తి సత్యనారాయణ, తొంట నాగబాబు, పి సత్యనారాయణ, జన్ని మహలక్ష్మి, జోగిసాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): సర్దుబాటు పేరుతో కరెంట్ చార్జీలు పెంచడం మానుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావువ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జయలక్ష్మి సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఏఈకి వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల పేరుతో మరోసారి రాష్ట్ర ప్రజల మీద భారాలు మోపాలని చూస్తుందన్నారు. ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో ప్రజలపై 8,114 కోట్లు రూపాయిలు భారాలు వేయడం వల్ల గృహ వినియోగదారులపై అదనపు భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కరెడ్ల రామకృష్ణ, సిరపరపు రంగారావు, జే.శ్రీను, కోదండ రామిరెడ్డి, వెంకట్రావు, నాగేశ్వరరావు, దుర్గా, కృష్ణ, సాయి, రమణ, నాగిరెడ్డి, శివ, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను పేదలకు పంచాలి



బంగారుగూడెంలో జరిగిన మహాసభలో నినాదాలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంచాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ పొలుపూరి సత్యనారాయణ, మండల నాయకుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బంగారుగూడెం గ్రామంలో సీపీఎం గ్రామ మహాసభ శంకరపు మహాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారుగూడెం, వీరంపాలెం గ్రామంలో అసైన్డ్ భూములు అన్యాక్రాంతమై భూస్వాములు, ధనిక రైతులు చేతుల్లో ఉందన్నారు. బినామీ పేర్లతో పట్టాలు తీసుకొచ్చారని, ప్రభుత్వం దీనిపై దర్యాప్తు జరపాలన్నారు. అనంతరం గత మూడేళ్ళ కార్యకలాపాల నివేదికను సిద్దాబత్తుల నాగేశ్వరరావు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పోలుపో బాయమ్మ, అయినపర్తి వెంకటేశ్వరరావు, గుమ్మడి కేశవ తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న వ్యాధులు

- డెంగీ, టైఫాయిడ్ బాధితులు అధికం
- వేగంగా విస్తరిస్తున్న కళ్ల కలక
- ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు



ఇరగవరం పీహెచ్‌సీ



ఇరగవరంలో రోడ్డు పక్కనే చెత్తకుప్పలు

ఇరగవరం: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఎవరిని కదిపినా జ్వరం, ఎక్కడ చూసినా కళ్ల కలక. ఇవే ప్రస్తుతం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వైరల్ వ్యాధులు. వర్షాలు విపరీతంగా కురవడంతో వాతావరణంలో మార్పులు వచ్చి జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. అధికారులు ప్రభుత్వాసుపత్రులతో పాటు స్థానికంగా ఉండే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అప్రమత్తం చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులను అప్రమత్తం చేసింది. రోగులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా వారికి అవసరమైన అన్నిరకాల వైద్య సదుపాయాలు సమకూర్చుతోంది.

రోజూ 700 మంది వరకూ రోగులు

తణుకు నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రికి నిత్యం వచ్చే రోగుల సంఖ్య 600 నుంచి 700 వరకూ ఉంటోంది. వీరిలో ఇతర వైద్య చికిత్సలకు వచ్చే వారి మినహా మెడికల్ ఓపీ 200 మంది వరకూ వస్తున్నారు. వీరిలో జ్వర పీడితులు 40 నుంచి 50 మంది ఉంటున్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వ మంచి రోజుకు 10 నుంచి 20 మందిని ఇన్‌పేషెంట్లుగా ఆసుపత్రిలో చేర్చుకుని వైద్య చికిత్సలు అందజేస్తున్నారు.

ప్రత్యేక ఫీవర్ వార్డు

జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉండడంతో ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు చేశారు. మగవారికి 20 బెడ్లు, ఆడవారికి 10 బెడ్లు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. 24 గంటలూ పూర్తిస్థాయి వైద్య చికిత్సలు అందించే విధంగా వైద్యులు, సిబ్బందికి డ్యూటీలు వేశారు. ఆసుపత్రి, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో పూర్తిస్థాయి మందులను అందుబాటులో ఉంచారు.

అధిక సంఖ్యలో కళ్ల కలక బాధితులు

కళ్ల కలకతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్యలో పెరుగుతోంది. వీరి సంఖ్య నిత్యం 50కి పైగా ఉంటోందని ప్రభుత్వాసుపత్రి వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి రాకుండా ముందుగా అప్రమత్తతతో వ్యవహరించాలి. ఈ కేసులు రోజు రోజుకీ గణనీయంగా పెరుగుతున్నాయి. దీనికి కారణం ఇది ఒకరి నుంచి మరొకరి సోకుతోంది. చాలా మంది కళ్ల కలక అంటే వెంటనే కళ్లను నీటితో కడుక్కుంటుంటారని అయితే దానితో పాటు ముఖ్యంగా చేతులను తరచూ నీటితో, శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఇది అధికంగా చేతుల ద్వారానే వ్యాప్తి చెందుతుందని చెబుతున్నారు. కళ్ల కలక ఉన్నవ్యక్తి ముట్టుకున్న వస్తువును మరొకరి తాకితే, ఆ చేతుల ద్వారా వ్యాధి వస్తుందన్నారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకండి



జ్వరం బారిన పడిన వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య అదే రీతిలో ఉంది. వైరల్ జ్వరాల నేపథ్యంలో ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. 24 గంటలూ పర్యవేక్షణ చేస్తున్నాం. రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. జ్వరం పూర్తిస్థాయిలో తగ్గిన తర్వాతే ఇంటికి పంపుతున్నాం. ఇదే విధానంలో ముందుకు వెళతాం. ప్రజలు జ్వరాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

బంగారు రవి, రేలంగి పీహెచ్‌సీ వైద్యులు

మానవత ఆర్థిక సాయం

తణుకు టౌన్: రాజమండ్రిలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థినికి తణుకు మానవత సంస్థ రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు తణుకు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. శనివారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థిని కేపీఎస్ శ్రీహ్లాదినికి తన కళాశాల ఫీజు నిమిత్తం తణుకు మానవత సంస్థ ద్వారా రూ. 15 వేల చెక్కును జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మానవత ఉపాధ్యక్షుడు కే రాజరాజేశ్వరరావు, రోటరీ క్లబ్ కార్యదర్శి కఠారి సిద్దార్థ, ఆలపాటి సుబ్బారావు, ఆకుల శేషు, సుబ్రహ్మణ్యం, ఆలపాటి సోమేశ్వరరావు, మల్లిపూడి లక్ష్మీ, వీ పార్వతి, ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నెల్సన్ ఆకస్మిక మృతి



ఖండవల్లి నెల్సన్

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఖండవల్లి నెల్సన్ (58) ఆకస్మికంగా మృతి చెందారు. నెల్సన్‌కు తల్లి వజ్రమణి, భార్య, ఒక కుమారుడు ఉన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడుగా నెల్సన్ జిల్లాలోని పెంటపాడు, కొయ్యలగూడెం, తణుకు, రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేశారు. నెల్సన్ మృతికి తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. నెల్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా కొట్టు సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు



మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కొట్టు రాజేష్



మాధవరం గ్రామంలో పోలేరమ్మ ఆలయంలోని ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలను స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో కుమారుడు కొట్టు రాజేష్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. కొట్టు రాజేష్‌కు మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పేరుతో బొకెలను అందజేశారు. పడాల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత కొట్టు సత్యనారాయణ మరిన్ని పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్,తమ్మిశెట్టి చుక్కయ్య, వట్టి బుజ్జి, చెన్నా జనార్ధనరావు, కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, జిడ్డు హరిబాబు, నూనె అనూరాధ, దింటకుర్తి లీలావతి, కన్నాటి కన్నయ్య, కోడే శ్రీను, ముప్పిడి లక్ష్మణరావు, చిటికెన ప్రసాద్, మెహర్‌బాబు, గార్లపాటి వీరకుమార్ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాధవరం అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ జన్మదినోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోలీక్రాస్ అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే, ఉప్పరగూడెం, వెంకట్రావుపాలెం గ్రామాల్లో దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జిడ్డు హరిబాబు, నాయకులు తమ్మిశెట్టి చుక్కయ్య, తారమట్ల శ్రీనివాస్, తమ్మిశెట్టి రఘు తదితరులు పాల్గొన్నారు. మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ కట్ట రంగాబాబు కేకు కట్ చేసి పంపిణీ చేశారు. శీలం మతయ్య, సాదే ప్రసాద్ మర్లపాటి రంబాబు చిటకన కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువు



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు రక్షణ కరువైందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్, బేతాళ శరత్‌బాబులు పేర్కొన్నారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కాళ్ల మండలం, ఏలూరుపాడులో 30 రోజుల క్రితం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉండి ఎమ్మెల్యే రఘురాంకృష్ణంరాజు చించివేసాడని, క్షమాపణ చెప్పలేదని, ఇంత వరకూ పోలీసులు కేసు నమోదు చేయలేదని, తాత్సారం చేయడాన్ని నిరిస్తున్నట్లు చెప్పారు. రఘురాం కృష్ణంరాజుపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద కేసు నమోదు చేయాలని, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎస్సీ ఉద్యోగిపై చేయ్యి చేసుకున్న కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీపై చర్యలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీలకు రక్షణ కరువైందన్నారు. రఘురాం కృష్ణంరాజును అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ 29వ తేదీన మాల సంఘాల జేఏసీ, దళిత ప్రజా సంఘాలతో ఛలో సెక్రటేరియట్ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విప్పర్తి ప్రభాకర్‌రావు, జోగయ్య, నానాజీ, సునీల్ కుమార్, కృపానాథ్, చక్రవర్తిలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



మహిళా సంరక్షణ కార్యదర్శులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

తాడేపల్లిగూడెం అర్బన్ : మద్యం సేవించి వాహనాలు నడపొద్దని డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచనలు చేశారు. తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్, పెంటపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసు సిబ్బందికి, వార్డు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ డి.విశ్వనాథ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. యువతుల పట్ల ఈవ్‌టీచింగ్‌కు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కూడళ్లలో ఎక్కువ మంది జనసందోహం నిలబడనివ్వవద్దని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడకుండా ప్రత్యేక సిబ్బంది గస్తీ చేయాలన్నారు. చోరీలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది యువకులు గంజాయి సేవించి ఘర్షణలకు పాల్పడుతున్నారని వారిపై గంజాయి సరఫరా చేస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశానికి పట్టణ సీఐ ఎసుబ్రహ్మణ్యం, రూరల్‌సీఐ జెవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అట్లతద్దె పండుగ



అత్తిలిలో గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు



ఊయలు ఊగుతున్న మహిళలు

అత్తిలి: హిందూ సంప్రదాయంలో అట్లతద్ది పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. కొత్తగా పెళ్లయిన నూతన వధువుల చే ఈ పండగ నిర్వహిస్తారు. అటువంటి ప్రాశస్త్యం ఉన్న అట్లతద్ది పండుగను శనివారం వేలాది మంది నూతన వధువులు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. తెల్లవారుజామునే నిద్రలేచి కాలకృత్యాలు పూర్తయిన తర్వాత ఆహారం సేవిస్తారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయమై ఆకాశంలో చుక్క (నక్షత్రం) వచ్చే వరకు కఠిన ఉపవాసం ఉంటారు. ఈ మధ్యలో మంగళగౌరీ వ్రతం, గంగ పూజ, గోపూజ చేస్తారు. 11 మంది ముత్తయిదువులకు వాయనం ఇస్తారు. ఆకాశంలో చుక్క వచ్చిన అనంతరం ముత్తయిదువులతో కలిసి ఆహారం సేవించడంతో ఈ అట్లతద్ది పండుగ ముగుస్తుంది. ఈ విధంగా కొత్త వధువుల చేత వరుసగా మూడేళ్ల అట్లతద్ది పండుగ చేయిస్తారు. అనంతరం కులాచారం బట్టి ప్రతి ఏడాది అట్లతద్ది రోజున మహిళలు ఉపవాస దీక్ష చేస్తారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన రఘురాంనాయుడు



మాధవరం గ్రామంలో గోపిశెట్టి అర్జునుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డీ రఘురాంనాయుడు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాజీ సర్పంచ్ కామన చంద్రరావు (మోదుగ గుంట), గోపిశెట్టి అర్జునుడు (మాధవరం), మైనం రాముడు (లింగారాయుడిగూడెం) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాంనాయుడు శనివారం పరామర్శించారు. మైనం రాముడు కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని రఘురాంనాయుడు అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి.శేషులత, ఎమ్పీటీసీలు దారపురెడ్డి శ్రీనివాస్, మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరం, నార్ని రవికాంత నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాకరాజు సతీష్, కొండుబోయిన కృపావరం, సబ్బితి బ్రహ్మయ్య, చంద్రు శ్రీనివాస్, చిన్నం సురేష్, ఉర్ల నవీన్, ముళ్లపూడి బాపన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ కేంద్రాల్లోనే వృత్త్యంతర శిక్షణ నిర్వహించాలి

తణుకు అర్బన్: అల్పపీడనంతో భారీ వర్షాలు పడుతున్న పరిస్థితుల్లో 1,2 తరగతులు బోధిస్తున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణను మూడు జిల్లాలకు కలిపి ఒకేచోట నిర్వహించడం సబబుకాదని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ జాకబ్‌బాబు అన్నారు. ఉపాధ్యాయులకు ఫౌండేషనల్ లెటరీసీ, న్యూమరసీ పేరుతో జాతీయ విద్యావిధానం 2020కి అనుగుణంగా నిర్వహించనున్న ఈ శిక్షణను ప్రతి జిల్లాలో నాలుగు మండలాలకు కలిపి ఒక పట్టణ కేంద్రంలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు వారి కుటుంబాలు పడే ఇబ్బందులను విద్యాశాఖాధికారులు దృష్టిలోకి తీసుకోవాలని కోరారు.

డాక్యుమెంట్స్ పోయినవి

1. కొర్ల నాగేశ్వరరావు S/O సత్యనారాయణ, పైడిపర్రు, తణుకు.2. మారుతీ వెంకట వేణుగోపాల గౌరీ శంకర్, S/O శేష చలపతిరావు, తణుకు. 3. వెన్నుపూస నాగార్జున రెడ్డి, S/O పేరైడ్డి, ఒంగోలు. మేము అందరం కలిసి భీమవరం(మం) యనమదురు(గ్రా) పరిధి లో సర్వే No.254/4 అ లో 0.37 సెంటు ఎవరికి వారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నా రిజిస్టర్ డాక్యుమెంట్ No..(9858/2022), (2885/2022), (1054/1986)పాస్ బుక్స్ ఆన్లైన్ చేయుటకు జిరాక్స్ నిమిత్తం తణుకు నరేంద్ర సెంటర్ కి వస్తూండగా మధ్యలో పడిపోయినవి.దొరికితే ఈ నెంబర్ కి తెలుపగలరు. ఫోన్ : 8886666638

రిమాండ్ ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి



తణుకు సబ్ జైలులో రిమాండ్ ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యవతి

తణుకు అర్బన్: క్షణికావేశంలో చేసే పొరపాట్లుతో రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం తణుకు సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న సౌకర్యాలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యవతి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వృత్తిలో కష్టపడి పనిచేయాలని ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడితే చట్టంలో ఉన్న శిక్షలు తప్పవని అన్నారు. రిమాండ్ అనంతరం బయటకు వెళ్లాక మంచి జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. ముద్దాయిలకు న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్తోమత లేకపోతే కోర్టు ఉచితంగా న్యాయవాదిని అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జైలులో రిమాండ్ ముద్దాయిలకు ఉన్న వసతులతోపాటు వారికి అందిస్తున్న ఆహారం, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మోహనరావు, జైలు విజిటింగ్ న్యాయవాది డి.కృష్ణకుమారి, సాధనాల వెంకటగిరి, సీనియర్ న్యాయవాది కొరు వెంకటేశ్వర్లు, ప్యానెల్ న్యాయవాది అజలంకా అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయి వీరభద్ర ట్రస్ట్ ఏర్పాటు



ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్న అడ్డాల నరసింహారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 11వ వార్డులో శనివారం సాయి వీరభద్ర ట్రస్ట్‌ను చైర్మన్ బీవీడీఎల్ శివశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర బీసీ నాయకులు అడ్డాల నరసింహారావు ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా అట్టడుగు పేదవారికి, తల్లిదండ్రులు లేని నిరుపేద పిల్లలకు, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారికి చదువుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బి.ప్రతాప్‌రావు, సెక్రటరీ వెంకట లక్ష్మి, చిటికిన సురేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేఘ సోయగం



ఆకాశాన మేఘ మాలికలు... చూసే హృదయానికి కళ్లుండాలే గానీ... ప్రతి విరుపూ ఓ మధురమైన చిత్తరువే. నీలి ఆకాశం కాన్వాస్‌గా చేసుకుని రుధిర మబ్బులు వన్నెలద్దుకుంది. తణుకు పట్టణంలోని శనివారం సాయంత్రం ఎరుపు రంగులో మబ్బులు ఆకాశహర్మ్యలుగా కదలాడాయి. ఈ దృశ్యాన్ని చూపరులకు ఆనందాన్నిచ్చాయి. - తణుకు